
కేపీసీసీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా ఐశ్వర్య మహదేవ్



బెంగళూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌గా ఐశ్వర్య మహదేవ్ నియమితులయ్యారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం నుంచే అమలులోకి వచ్చేలా ఆదేశాలు జారీ చేశారు. ఐశ్వర్య మహదేవ్ మైసూరు జిల్లా కేఆర్‌పేట వాసి కాగా బెంగళూరులో నివసిస్తున్నారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

ముగిసిన.. సర్వే..!



- రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ ఉపకులాల లెక్కింపు పూర్తి
- నెలాఖరుకు నివేదిక
- నమోదుకు దూరంగా 8లక్షల మంది
- హావేరి జిల్లాలో అత్యధికం.. బీబీఎంపీ పరిధిలో అత్యల్పం

బెంగళూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సామాజికవర్గంలో తెగల వారీగా రిజర్వేషన్లు కల్పించేందుకు చేపట్టిన సర్వే పూర్తయ్యింది. రాష్ట్రప్రభుత్వం సిఫారసుతో ఏర్పడిన మాజీ న్యాయమూర్తి హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ నేతృత్వంలోని కమిషన్ వర్గీకరణకు సంబంధించి సమగ్ర నివేదికను జులై నెలాఖరుకు సమర్పించే అవకాశం ఉంది. వర్గీకరణకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో ఎస్సీ సామాజికవర్గాల కుటుంబాల వివరాలను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సర్వే సోమవారంతో ముగిసింది. ఎస్సీ సామాజికవర్గంలో తెగలవారీగా రిజర్వేషన్లు కల్పించేందుకు సర్వే జరిగింది. రెండు నెలలుగా ఇంటింటా తిరిగి సేకరించిన ఎస్సీ సామాజికవర్గంలోని వివిధ ఉపకులాలకు సంబంధించిన ప్రక్రియ ముగిసింది. మే 5న ఇంటింటి సర్వే ప్రారంభమైంది. రాష్ట్రంలో 2025 నాటికి ఎస్సీ సామాజికవర్గం జనాభా అంచనా 1.16కోట్లుగా పరిగణించగా ఈనెల 27వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 91శాతం బెంగళూరు నగర పరిధిలో 51శాతం సర్వే సాధ్యమయ్యింది.

పలు జిల్లాల్లో 90 శాతం పైగానే..

2025 అంచనా జనాభా ప్రకారం పోలిస్తే 12 జిల్లాల్లో వందశాతం కంటే ఎక్కువమంది సర్వేలో భాగస్వామ్యులయ్యారు. ఇందులో హావేరీ జిల్లాలో అత్యధికంగా సర్వేలో పాల్గొన్నారు. 9 జిల్లాల్లో 95-99శాతం, ఏడు జిల్లాల్లో 90-94శాతం మంది సర్వేలో పేర్లు నమోదు చేసుకున్నారు. దక్షిణకన్నడ జిల్లాలో 89శాతం, రామనగర జిల్లాలో 86శాతం, బెంగళూరు నగర జిల్లాలో బీబీఎంపీ మినహాయించి 80శాతం మంది సర్వేలో పాల్గొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.04 కోట్లమంది ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఉన్నారు. వారిలో ఆది ఆంధ్ర (ఏఏ), ఆది కర్ణాటక (ఏకే), ఆది ద్రావిడ (ఏడీ) 44లక్షలు 43.36శాతం ప్రజలు ప్రకటించుకున్నారు. కొన్ని జిల్లాల్లో ఆది కర్ణాటకగా రాయించుకున్నా మాదిగలుగా ప్రస్తావించారు. ఆది ద్రావిడ ఇదే తరహాలోనే నమోదు చేయించారు. ఏఏ, ఏకే, ఏడీ అనేది ఒక కులం కాదని ప్రత్యామ్నాయంగా కులంలోని గుంపులుగా ఉన్నారు. వీరు సమీక్షలో తమ ఉపజాతులను నమోదు చేసుకోవాలని స్పష్టంగా సూచించినా 8లక్షల మంది వివిధ కారణాలతో తమ ఉపకులాలను నమోదు చేసుకోలేదు. కుల వర్గీకరణ చేస్తున్నదశలో ఏఏ, ఏకే, ఏడీ అనేది నమోదు చేసుకున్న జనాభాను బట్టి తీవ్రతను పరిగణించి పరిహారం తెలుసుకోగలిగారు. మరో రెండు మూడు రోజుల్లో ఈ గణాంకాలు స్పష్టంగా తేలనున్నట్టు కమిషన్‌వర్గాల ద్వారా తెలుస్తోంది. కొన్ని కుటుంబాల వారు మూల కులం తెలిసినా ఆ కులానికి సంబంధించి ప్రభుత్వం గుర్తించిన 101 ఉపకులాల జాబితాలో లేరు. అటువంటివారు ఉపకులాలు చెప్పినా నమోదు చేయడం సాధ్యం కాలేదు. దక్షిణకన్నడ జిల్లాలో మన్నా, కొడగు జిల్లాలో కంబట్టి, ఉడుపిలో మేరా, రాయచూరులో మాదిగ దాసరివంటి కొన్ని ఉపకులాలు ఏకే, ఏఏ, ఏడీగానే నమోదు చేసుకున్నారు. ఇలా పలువురు ఉపకులాల పేరుతోనే కులధ్రువీకరణపత్రాన్ని పొందారు. మరికొందరు తమ మూలకులం తెలిసినా ఉపకులం పేరు నమోదు చేసేందుకు సామాజికంగా అవమానం కలిగించేలాంటి పదాలు ఉండడంతోపాటు పలు కారణాలతో చెప్పుకోవడానికి నిరాకరించారు. వారంతా ఏకే, ఏడీ, ఏఏ జాబితాలోనే కొనసాగనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 101 ఉపకులాలు..

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ సామాజికవర్గంలో 101 ఉపకులాలు ఉన్నాయి. 10 ఉపకులాలకు చెందినవారు ఒకేచోట నివసించేలాంటి ప్రాంతాలు ఎక్కడా లేవు. ఉపకులాల మధ్యనే తారతమ్యం ఉన్నట్లు సర్వే ద్వారా తేలింది. హొళెయర కాలనీ వేరుకాగా మాదిగల వీధి వేరుగా ఉంది. బోవి, లంబాణి సామాజిక వర్గానికి చెందినవారు ప్రత్యేక కాలనీలుగా ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు. ఒక ఉపకులానికి చెందినవారితో మరో ఉపకులం ఎందులోనూ సంబంధ బాంధవ్యాలు లేవు. వివాహాలు చేసుకోవడంగానీ ఇతరత్రా కలసి పంచుకునే ప్రక్రియ లేదు. దీన్నిబట్టి ఎస్సీ సామాజికవర్గంలోని ఉపకులాలలోనూ సమాంతరం లేదని సర్వే ద్వారా తేలింది. కొన్ని ఉపకులాలకు చెందినవారి బావులలో మరొకరు నీటిని కూడా వాడుకోవడం లేదని తెలుస్తోంది.

ఉద్యోగుల్లోనూ ఏఏ, ఏకే, ఏడీ

ప్రభుత్వానికి అనుబంధమైన 43శాఖల్లో ఉద్యోగుల వివరాలను సేకరించారు. అందులో 25శాతంమంది సిబ్బంది ఏఏ, ఏడీ, ఏకేలుగాను నమోదు చేసుకున్నారు. ఉపకులాలు ప్రస్తావించలేదు. వివిధ కార్పొరేషన్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఎస్సీ సామాజికవకర్గంలోని కార్పొరేషన్ లబ్ధిదారులు ఉపకులాల సమాచారం లేదు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఏడు కార్పొరేషన్లలో మాత్రమే ఉపకులాలవారు లబ్ధిదారుల జాబితాలో కొంత స్పష్టత ఉంది. దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగిన 1952 నుంచి 2024 వరకు లోక్‌సభ, శాసనసభలకు ఎన్నికైనవారి సమాచారాన్ని సేకరించారు. ఎన్నికల కమిషన్ కూడా ఎస్సీ అని మాత్రమే నమోదు చేసింది. ఇంటింటి సర్వేలో ప్రజాప్రతినిధుల ఉపకులాలు కొంత తేలాయి. అందులోనూ ఏఏ, ఏకే, ఏడీలుగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. సర్వే పూర్తి కావడంతో సమగ్ర నివేదికలో అన్ని అంశాలను పరిగణిస్తామని కమిషన్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

రెండుసార్లు వాయిదా

2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీల జనాభా 1.04 కోట్లు. 2025 అంచనాల జనాభా గణాంకాల ప్రకారం 1.16 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో ఈనెల 27వరకు 1.06 కోట్లమంది సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ ప్రకారం 91శాతం మంది మాత్రమే సర్వేకు స్పందించినట్లు అయ్యింది. వాస్తవానికి రాష్ట్రంలో వర్గీకరణకు సంబంధించి సుదీర్ఘకాలంగా సర్వే జరపాలనే డిమాండ్ ఉంది. అయితే పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. సీఎం సిద్దరామయ్య సమగ్ర సర్వే జరిపి వర్గీకరణ అమలు చేస్తామని ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించారు. ఇలా సమగ్ర కసరత్తు జరిపి మే 5వ తేదీ నుంచి సర్వే జరిపేలా నిర్ణయించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్‌ను విద్య, ఆర్థిక, రాజకీయ, సామాజికంగా వెనుకబడిన ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం కొరత ఉన్న ఉపకులాలను గుర్తించి వర్గీకరణను అమలు చేసేలా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. మే 5న ప్రారంభించి రెండు వారాల్లో దాదాపు ముగించాలని భావించారు. కానీ సాధ్యం కాలేదు. సర్వే చేసే సిబ్బంది తొలుత ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ సులభంగా సాధ్యం కానుంది. కానీ జిల్లా కేంద్రాలతోపాటు దాదాపు 10కిపైగా మహానగరాలలో ఎస్సీ కులానికి చెందినవారిని గుర్తించడమే సవాల్‌గా మారింది. తొలుత ఓటరు జాబితా ప్రకారం ప్రక్రియ కొనసాగించారు. ఆ తర్వాత వార్డులు, ప్రముఖ ప్రదేశాలకు అనుగుణంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడ వివరాలు నమోదు చేసుకునే వెసలుబాటు కల్పించారు. అయినా పూర్తిస్థాయిలో సాధ్యం కాకపోవడంతో దాదాపు మూడుసార్లు పొడిగిస్తూ వచ్చారు. ఇలా జూన్ ఆఖరుకు ఎస్సీ సామాజికవర్గంలో ఉపకులాలను గుర్తించే సర్వే ముగుస్తుందని ప్రకటించారు. ఈ ప్రక్రియకు దళితసంఘాలతోపాటు సామాజికసంఘాలు, వివిధ కార్పొరేషన్ల ఉద్యోగుల సహకారం తీసుకున్నారు. అయినా వందశాతం సర్వే పూర్తికాలేదని అంచనాల జనాభా ప్రకారం తెలుస్తోంది.



మీడియాతో మాట్లాడుతున్న సుర్జేవాలా

నాయకత్వ మార్పు లేదు

- అధిష్టానానికి అలాంటి ఆలోచన లేదు
- మీడియాతో రణదీప్‌సింగ్ సుర్జేవాలా
- కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌తో అసంతుష్ట ఎమ్మెల్యేల భేటీ

బెంగళూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయకత్వ మార్పు వంటి అంశం అధిష్టానం ముందు లేదని, కానీ పార్టీ ఎమ్మెల్యేలందరినీ కలవాలని భావిస్తున్నానని మూడు రోజులు కాంగ్రెస్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ మీడియాతో అన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేసిన నేపథ్యంలో స్వయంగా తెలుసుకునేందుకు సుర్జేవాలా బెంగళూరు చేరుకున్నారు. తొలిరోజున సోమవారం తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన కలబురగి జిల్లా ఆళంద ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ వెళ్లారు. కేపీసీసీ కార్యాలయంలో సుమారు అరగంటకు పైగా బీఆర్ పాటిల్ ఆళంద నియోజకవర్గంలో హౌసింగ్ అవినీతితో పాటు మైనారిటీ కార్పొరేషన్ నుంచి రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి సంబంధించి కనీస సమాచారం లేదని వివరించారు. అన్ని అంశాలపైనా పలు రికార్డులను సుర్జేవాలాకు అందించారు. సమస్యలు ఉంటే చర్చిద్దామని, బహిరంగంగా వ్యాఖ్యలు వద్దంటూ సుర్జేవాలా తెలిపారు. సుర్జేవాలాతో కలిశాక బీఆర్ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ అధిష్టానం నుంచి పిలుపు వచ్చిందని, నేను ఏం చెప్పాలో అన్నీ వివరించానన్నారు. నా వ్యాఖ్యలు రాసుకున్నారన్నారు. ఏఐసీసీ, కేపీసీసీలు సంయుక్తంగా పనిచేయాలని అదే తరహాలోనే ఎమ్మెల్యేలు, ప్రభుత్వం సమన్వయంగా ఉండాలని సూచించారన్నారు. నాయకత్వ మార్పు ప్రస్తావనే లేదని, అవన్నీ ఊహలని కొట్టిపారేశారు.

- బంగారపేట ఎమ్మెల్యే నారాయణస్వామితో భేటీ అయ్యారు. పలువురు మంత్రుల తీరు గురించి అడిగితెలుసుకున్నారు. ఇటీవల కోలారు పాల ఉత్పత్తిదారుల సమాఖ్య విషయంలో చోటు చేసుకున్న గందరగోళంపై వివరించారు. నంజేగౌడ ఏమైనా పులా..? మేం పుట్టుకతో కాంగ్రెస్ అని, ఆయన ఇటీవలే జేడీఎస్ నుంచి వచ్చి కొత్త రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజుకాగె మంగళవారం భేటీ అయ్యే అవకాశం ఉంది.

పాము కాటుతో తల్లి, కుమారుడి మృత్యువాత


6



సుబ్బమ్మ బసవరాజ(ఫైల్)



వాయనం సమర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు



కేఆర్‌ఎస్ డ్యాం

కరుణించిన కావేరి..!

- రాష్ట్రంలో నిండుకుండల్లా జలాశయాలు.. అంతా సస్యశ్యామలం
- కేఆర్‌ఎస్‌కు వాయనం సమర్పించిన సీఎం

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కావేరిమాత అనుగ్రహంతో కోట్లాదిమందికి తాగునీరు, లక్షలాది హెక్టార్లలో పంటలసాగు సాధ్యమవుతోందని సీఎం సిద్దరామయ్య అన్నారు. కావేరి నదికి అనుబంధమైన కేఆర్‌ఎస్ జలాశయం గరిష్ఠమట్టానికి చేరుకోవడంతో సీఎం సిద్దరామయ్య సోమవారం వాయనం సమర్పించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జలాశయాలకు నీరు సంతృప్తికరంగా చేరిందని, కాలువలకు నీరు వదులుతామన్నారు. తమ ప్రభుత్వం 25వేల కోట్ల రూపాయలు జలవనరుల విభాగానికే ఖర్చు చేసిందన్నారు. కాలువల మరమ్మత్తుతోపాటు పలు చారిత్రాత్మక పనులు చేశామన్నారు. కేఆర్‌ఎస్‌కు గరిష్ఠమట్టంలో నీరు చేరిందన్నారు. 93ఏళ్లలో 76సార్లు కేఆర్‌ఎస్ నిండిందన్నారు. 2023-24లో కరువు వచ్చిందని, అప్పుడు సిద్దరామయ్య కాలుపెడితే నీరు రావని ప్రతిపక్షాలు విమర్శించాయన్నారు. గత ఏడాదితో పాటు ప్రస్తుతం కేఆర్‌ఎస్ నిండిందన్నారు. 93ఏళ్ల చరిత్రలో జూన్‌లో కేఆర్‌ఎస్ నిండడం ఇదే ప్రథమమన్నారు. అబద్ధాలు చెప్పడం బీజేపీ లక్ష్యమన్నారు. రాష్ట్రప్రజలు ఇప్పటివరకు బీజేపీకి సంపూర్ణ మెజారిటీ ఇవ్వలేదన్నారు. ఓసారి జేడీఎస్‌తో కలసి, మరోసారి ఆపరేషన్ కమలతో పాలన సాగించారన్నారు. జేడీఎస్ మరొకరి భుజంపై చేయి వేసుకుని అధికారంలోకి రావాల్సిందేనని, వారికి సొంత శక్తి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. తాను అబద్ధాలు చెబితే ప్రజలకు అర్థం కాదా..? అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు రైతులకు విత్తనాలు, ఎరువులు సమస్య రాలేదన్నారు. బీజేపీ పాలనలో రైతులపై కాల్పులు జరిపారన్నారు. కావేరిమాత, చాముండేశ్వరి కృపా కటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానన్నారు. కావేరి అభివృద్ధి కోసం 3వేల కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. కేఆర్‌ఎస్‌కు సీఎం చేరుకోగానే వేదపండితులు స్వాగతించారు. పూజల అనంతరం కేఆర్‌ఎస్ ప్రాజెక్టు వద్దకు వెళ్లి వాయనం సమర్పించారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు మహదేవప్ప, చలువరాయస్వామి, మంత్రులు వెంకటేశ్, బోసరాజు, స్థానిక ఎమ్మెల్యేలు తన్వీర్ సేఠ్ సహా పలువురు పాల్గొన్నారు. అనంతరం కేఆర్‌ఎస్ జలాశయం అవుట్‌ఫ్లో ప్రాంతాన్ని సీఎం పరిశీలించారు. తదుపరి ప్రజలతో కాసేపు మాట్లాడారు.

బండ లాంటి బలం

- మా ప్రభుత్వానికి ఢోకా లేదు..
- భేదాభిప్రాయాలు లేవు.. ఐదేళ్లు పాలిస్తాం..
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మా ప్రభుత్వం ఐదేళ్లు బండరాయిలా భద్రంగా ఉంటుందని, ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని సీఎం సిద్దరామయ్య అన్నారు. సోమవారం మైసూరు విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి తాను, డీసీఎం డీకే ఇద్దరమూ కలిసే ఉన్నామన్నారు. తమ ప్రభుత్వానికి వచ్చిన ఢోకా ఏమీ లేదన్నారు. ప్రతిపక్ష బీజేపీ అబద్ధాలతో కాలయాపన చేస్తోందన్నారు. తమ మధ్య విబేధాలు ఉన్నాయని, ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. గ్యారెంటీలు ఆపలేదని, అభివృద్ధి నిలపలేదన్నారు. ఎమ్మెల్యేలకు అసంతృప్తి ఉంటే పార్టీ నేత సుర్జేవాలాతో తెలుపుకోవచ్చునన్నారు. జేడీఎస్ పార్టీ రాష్ట్రంలో ఎప్పుడూ ఒంటరిగా గెలవలేదని, బీజేపీకి ప్రజల ఆశీస్సులు లేవన్నారు. పక్కనే ఉన్న డీసీఎంతో నవ్వుతూ మాట్లాడుతూ ఇద్దరూ చేతులెత్తి అభివాదం చేశారు. మా ప్రభుత్వం కూలుతుందని కొందరు మాట్లాడుతారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఐదేళ్లే కాదు, 2028లోనూ మేమే అధికారంలోకి వస్తామన్నారు. జలవనరులశాఖకు రూ.25వేల కోట్ల రూపాయలు కేటాయించామని, గతంలో ఏ ప్రభుత్వమైనా ఇంతభారీగా మంజూరు చేసిందా..? అని ప్రశ్నించారు. అభివృద్ధికి ఎక్కడా ఆటంకం లేకుండా గ్రాంట్లు కేటాయిస్తున్నామన్నారు. వ్యవసాయ ప్రగతికి 19వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామన్నారు. 92ఏళ్ల తర్వాత జూన్‌లో కేఆర్‌ఎస్ నిండడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో నదులన్నీ జలకళతో నిండంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.



మృత్యుదారి..!

- విషాదం మిగిల్చిన రోడ్డు ప్రమాదాలు
- కంటైనర్, టెంపో ఢీకొని ముగ్గురు బాగేపల్లి వాసుల మృతి
- అన్నమయ్య జిల్లా చెన్నామర్రి మిట్ట వద్ద ఘోరం
- తిరుమల వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు..

రహదారులు మృత్యుదారులుగా మారాయి.. ప్రమాదాల రూపంలో కాటేసి రెండు కుటుంబాల్లో విషాదం నింపాయి. అన్నమయ్య జిల్లా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి వస్తూ ముగ్గురు బాగేపల్లి వాసులు మృతి చెందారు. తుమకూరు జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఒక్కలిగ సంఘం డైరెక్టర్ సీబీ గౌడ సహా భార్య, కుమారుడు, కుమార్తె దుర్మరణం పాలయ్యారు.



మేఘర్ష్ చరణ్ శ్రావణి(ఫైల్)

కురబలకోట/బాగేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని ఆనందంగా ఇళ్లకు వెళుతున్న వారిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. అన్నమయ్య జిల్లా హైదరాబాద్-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని చెన్నామర్రి మిట్ట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా 12 మంది తీవ్రంగా గాయపడ్డ విషాదకర సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. దీనికి సంబంధించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన మూడు కుటుంబాలకు చెందిన నరసింహారెడ్డి, రామచంద్రప్ప, కొత్త ఉడియంకు చెందిన శివప్పలు స్నేహితులు. వీరు వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ మూడు కుటుంబాలకు చెందిన వారు రెండు రోజుల క్రితం తిరుమల స్వామి దర్శనానికి టెంపో ట్రావెలర్‌లో బయలుదేరి వెళ్లారు. స్వామి వారి దర్శనం అనంతరం తిరుమలలో ఆనందంగా గడిపిన వారు స్వగ్రామానికి ఆదివారం రాత్రి తిరుగుపయనమయ్యారు. సోమవారం తెల్లవారుజామున కురబలకోట మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న కంటైనర్ ఢీకొనడంతో టెంపో ట్రావెలర్ నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో ముగ్గురి కుటుంబాలలో ఒక్కొక్కరు చొప్పున మేఘర్ష్(17), చరణ్ (17), శ్రావణి (24) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో నరసింహారెడ్డి (49), ఆయన భార్య రూపా (40), కుమారులు ఆదర్శ్ (20)లు, శివప్ప కుటుంబానికి చెందిన శివప్ప (45), ఆయన భార్య సునంద (36), చైత్ర (20), రామచంద్రప్ప కుటుంబానికి చెందిన రామచంద్రప్ప (53), ఆయన భార్య కళావతి (45), కుమారులు అశోక్ (30), దర్శన్ (19), హేమంత్ (13), డ్రైవర్ మంజునాథ్ (48)లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యచికిత్స అందించారు. కాగా వీరిలో మంజునాథ్, నరసింహారెడ్డి, శివప్ప, సునంద, ఆదర్శ్, రూపా, కళావతి, చైత్రల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు బెంగళూరులోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ మహేంద్ర, సీఐ సత్యనారాయణలు చేరుకుని విచారించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబీకులకు అప్పగించారు. మృతుల, క్షతగాత్రుడి కుటుంబీకుల రోదనలు ఆసుపత్రిలో మిన్నంటాయి. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రులను తరలిస్తున్న స్థానికులు

రోడ్డు ప్రమాదంలో ఒక్కలిగ సంఘం డైరెక్టర్ సీబేగౌడ కుటుంబం దుర్మరణం ...మెయిన్‌లో..

రైతు సమస్యలు పరిష్కరించండి

- సంఘం బళ్లారి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి
- కురుగోడులో అన్నదాతల భారీ నిరసన

నగర సమస్యలపై సంతకాల సేకరణ

కాంగ్రెస్ అవినీతికి అంతు లేదు..

- కమీషన్లతో బెంబేలెత్తిస్తున్న నాయకులు : జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనల్లి తాయణ్ణ
- బళ్లారిలో జనతాదళ్ ఆధ్వర్యంలో ఆందోళన

వివరాలు..6లో



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1622.12	1,581.73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,366	1.056
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	213	2037
నీటి నిల్వ (టీఎంసీలు)	67.47	5.37

రైతు సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసనలో రైతులు

● సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ● కురుగోడులో భారీ నిరసన

కంప్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రైతు సమస్యలు పరిష్కరించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి కోరారు. సోమవారం కురుగోడు పట్టణంలో రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తుంగభద్ర కాలువ నీటితో సాగు, వర్షపు నీటితో సాగు చేస్తున్నారన్నారు. రైతులు వివిధ పంటలు పండిస్తున్నప్పటికీ, సరైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. పట్టణంలోని రైతు సంఘం హాలులో జరిగిన రైతులతో జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశానికి ఆయన ఆధ్వర్యంలో నిర్వహించి మాట్లాడారు. ముందుగా వందలాది మంది రైతులు తహసీల్దార్ నరసప్పకు వినతి పత్రం అందజేశారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, గ్రామ పంచాయతీకి స్టాక్ దుకాణం నిర్మించాలని కోరారు. బళ్లారి కేఎంఎఫ్‌లో నిర్వహణ బోర్డును ఏర్పాటు చేయాలని, జిందాల్ ఫ్యాక్టరీ నుండి విషపూరిత వ్యర్థ జలాలు దరోజీ సరస్సులోకి రాకుండా ఆపాలన్నారు. మహాత్మా గాంధీ పథకాన్ని వ్యవసాయ కార్యకలాపాలకు అనుసంధానించాలి. ఎటువంటి కోతలు లేకుండా వ్యవసాయ పంపుసెట్లకు పది గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలి. తుంగభద్ర ఆనకట్ట తూములను వీలైనంత త్వరగా పునర్నిర్మించి రెండవ పంటకు నీరందించాలి. బళ్లారి నగరంలో ఎండు మిరప మార్కెట్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ యేడాది కూడా ఆలస్యం చేయకుండా మార్కెట్‌ను తెరచి ఈ రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. తుంగభద్ర ఆయకట్టు చివరిలో ఉన్న కురిగనూరు కాలువకు హెచ్ హోసళ్లి సరస్సు నీటిని మళ్లించడానికి ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. కంప్లి సమీపంలో ప్రవహించే నారిహళ్ల నీటిని ఎల్ఎల్‌సీ కాలువకు మళ్లించి ఆయకట్టు చివరి ప్రాంతానికి సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉమాపతి గౌడ్, బసవరాజరెడ్డి, జీ గాడి లింగప్ప, పంపాపతి, గుండారెడ్డి, నాగేశ్వరరావు, వీరేశప్ప, సురేంద్ర, గోవర్ధన్‌రెడ్డి, ఆదిగౌడ రామచంద్రప్ప, బసవరాజు, హనుమంతరెడ్డి, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

నగర సమస్యలపై సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న పోరపోరాట కమిటీ సభ్యులు

బళ్లారి సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు సమస్యలపై అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం బళ్లారి రాయల్ సర్కిల్లో పౌరపోరాట కమిటీ సంతకాల సేకరణ చేపట్టింది. కమిటీ ప్రాథమిక సౌకర్యాలను కోరుతూ ఈ నెల 27న భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. వేలాది మంది మద్దతుగా సంతకాలు చేశారు. సంతకాల సేకరణ ప్రచారాన్ని ప్రారంభించిన సలహాదారు ముర్తుజా సాబ్ మాట్లాడుతూ 2,3 నెలలుగా పలు సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాపరిపాలన కార్పొరేషన్ జిల్లాపరిపాలన , ప్రభుత్వ ప్రాథమిక సౌకర్యాల సమస్యలను పరిష్కరించడానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ భారీ ఆందోళన చేపడ్తామన్నారు. ఈ సందర్భంగాబలమైన ప్రజాపోరాటం ఏర్పడాలి. సంతకం సేకరణ ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కమిటీ కన్వీనర్ సోమశేఖర్‌గౌడ మాట్లాడుతూ మురుగునీరు తాగునీటిలో కలవకుండా నిరోధించడం ,రింగ్‌రోడ్డు నిర్మాణం, మోతీ వంతెన విస్తరణ, మున్సిపల్ సిబ్బంది , పౌరకార్మికుల సంఖ్యను పెంచడం, సుదాక్రాస్ ఫ్లైఓవర్ పూర్తి చేయడం వంటి అత్యవసర పనులు పూర్తి చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్లు అన్నారు. ప్రజల పన్నులు వృథా ఖర్చు పెడుతున్నారన్నారు. ప్రజల ప్రాధాన్యతను వదిలివేవయడం,ఉన్న రహదారి ఫుట్‌పాత్‌ను తవ్వి మరొక రహదారి ,ఫుట్‌పాత్ నిర్మించడం, ఉన్న సర్కిల్‌లను కూల్చివేసి అశాస్త్రీయ సర్కిల్‌లను నిర్మించడం ఇవి బళ్లారిలో అభివృద్ధిపనులుగామారాయి. ఈనేపథ్యంలో పౌరుల పోరాటాన్ని తీవ్రతరం చేసే లక్ష్యంతో జూలై 27న నగరంలో గాంధీ భవన్‌లో 1లక్ష సంతకాల సేకరణ ప్రచారం,మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తదుపరి డాక్టర్ ప్రమోద్, శాంత,నాగరత్న,గోవింద్,ఈశ్వరీ,రాజా ,పంపాపతి తదితరులు తమ డిమాండ్లను వివరించారు.

కరివేపాకు లారీ బోల్తా

● డ్రైవర్‌కు గాయాలు



బోల్తాపడిన కరివేపాకు లారీ

బళ్లారి సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కరివేపాకు లారీ బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హొసపేట బైపాస్ రోడ్డులో సోమవారం ఉదయం కరివేపాకుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. తెల్లవారుజామున సుమారు 3గంటల సమయంలో నిద్రమత్తులో లారీ రోడ్డు డివైడర్‌ను ఢీకొని పడిపోయింది. లారీలో ఆంధ్రప్రదేశ్ నుంచి ముంబైకు కరివేపాకు సాగిస్తున్నారు. డ్రైవర్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంచార పోలీస్ స్టేషన్ పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

పాము కాటుతో తల్లి, కుమారుడి మృత్యువాత

రాయచూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పడుకున్న చోటే పాము కాటుకు గురై తల్లి, కొడుకు మృత్యువాత పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దేవదుర్గ తాలూకా హేరుండి గ్రామానికి చెందిన సుబ్బమ్మ(35) ఆమె 10 ఏళ్ల కుమారుడు బసవరాజ శనివారం రాత్రి యథావిధిగా నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఇద్దరు పడుకున్న చోటే మృత్యువాత పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు తెలుసుకుని కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న దేవదుర్గ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం తల్లికొడుకు ఇద్దరికీ అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇసుక డంప్ స్వాధీనం

● భూ యజమానిపై కేసు



డంప్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయచూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా అప్రాళ-మదరకల్ ప్రధాన రోడ్డు సమీపంలోని వాగులో నుంచి అక్రమంగా తరలించిన 300 మెట్రిక్ టన్నుల ఇసుకను అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇసుక అక్రమ డంప్ పై దిన పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా స్పందించిన అధికారులు తహసీల్దార్ చన్నమల్లప్ప ఘంటి, గబ్బూరు ఎస్ఐ గంగప్ప బుర్లి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్పల నేతృత్వంలోని అధికారులు సంఘటన స్థళానికి వెళ్లి రూ.1,87,500 విలువ చేసే 300 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను నిల్వ ఉంచిన భూ యజమాని నాగరాజు పై కేసు నమోదు చేశారు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి: ఎస్ఐ



ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కంప్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామంలో విద్యార్థుల, యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా వుండాలని ఎస్ఐ శాంతిమూర్తి తెలిపారు. సోమవారం కుడితిని పట్టణంలో పోలీసులు నేతాజీ స్కూలు ఆధ్వర్యంలో కుడితిని పట్టణంలో మాదక ద్రవ్యాల విరోద సప్తహా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శాంతమూర్తి మాట్లాడుతూ వ్యసనాలకు లోబడి గంజాయి, డ్రగ్స్ ఇలాంటి వాటికి అలవాటు పడితే జీవితమే కాక కుటుంబాలు నాశనం అవుతాయని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు యువకులు తమ చుట్టూ మాదక ద్రవ్యాలు ఉపయోగించేవారు సమాజానికి విరుద్ధంగా చేపట్టేవారు వుంటే తమ చుట్టుపక్కల వుండే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. తమ చిన్నతనం నుండే మంచి అలవాట్లు కల్పించుకుని ఉత్తమపౌరులుగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ స్కూలు ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది విద్యార్థులు, పట్టణవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు

● అభినవ గవిసిద్ధేశ్వర మహాస్వామి

సిరుగుప్ప, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు మారుతుందని కొప్పళ గవిమఠం అభినవ గవిసిద్దేశ్వర మహాస్వాములు హితవు పలికారు. సిరుగుప్ప తాలుకా లోని ఇబ్రహీంపురం గ్రామంలో వుండే సుభిక్ష ఇంటర్నేషనల్ పాఠశాలను స్వాములు సందర్శించారు. అక్షరాభ్యాసం నేర్పే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సక్రమంగా విద్యాభ్యాసం చేసి ఉన్నత పదవులు దక్కించుకున్ననాడే దేశం ముందడుగు వేస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్య అనేది భూమిలో విత్తనం లాంటిదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సుభిక్ష ఇంటర్నేషనల్ పబ్లిక్ కళాశాల అధ్యక్షులు రాంబాబు వ్యవస్థాపకురాలు నాగశివానీలక్ష్మీ, ప్రిన్సిపాల్ స్వప్న రాఘవరావు, ప్రముఖులు జీ వెంకటస్వామినాయుడు, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అవినీతికి అంతు లేదు..

● జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ



నిరసన తెలుపుతున్న జేడీఎస్ నాయకులు

బళ్లారిరూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయన్న మండిపడ్డారు. జేడీఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రాయల్ సర్కిల్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పర్సెంటేజీలు ప్రభుత్వంగా మారుతుందని, పేద బడుగు బలహీనవర్గాలకు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే గృహాలకు డబ్బు డిమాండ్ చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు కిరణ్‌కుమార్, రైతు విభాగ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పుష్ప, జమీల బళ్లారి నగర అధ్యక్షులు వన్నూరుస్వామి, బళ్లారి గ్రామీణ అధ్యక్షుడు అశోక్, శివ నారాయణ, ఎల్లన్నగౌడ, కిరణ్ విజయ్‌కుమార్, రామాంజనేయ, జావీద్, షబానా హాజీ బాయ్, గురుస్వామి, ఈరన్న, జేడీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



కంప్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా కొట్టూరు గ్రామంలో బసవేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆషాఢం మాసం మొదటి సోమవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. జలాభిషేకం, అమృతాభిషేకం, పుష్పాభిషేకం, బిల్వార్చన, ఆకు పూజలు తదితర పూజలు నిర్వహించారు.



వెంకటరమణకు అర్హతపత్రం అందిస్తున్న కరవే నాయకులు

సేవలతోనే నాయకులకు గుర్తింపు

● కరవే రాష్ట్ర కన్వీనర్ అర్ధగేరి రామన్న

కంప్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తమ చుట్టూ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు చేసినప్పుడే నాయకులు గుర్తింపు పొందుతారని కరవే రాష్ట్ర కన్వీనర్ అర్ధగేరి రామన్న అన్నారు. సోమవారం కంప్లి పట్టణంలో అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ భూమి, నీరు, భాషను కాపాడి అభివృద్ధి చేయడానికి కరవే కార్యకర్తలు ముందుకు రావాలన్నారు. బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే ప్రభుత్వ సౌకర్యాలను ప్రజలకు అందించగలమన్నారు. నేటి ప్రపంచంలో కన్నడ ముఖ్యమైనదన్నారు. కరవే కార్యకర్తలు పోరాటాల ద్వారా కన్నడను కాపాడాలన్నారు. సామాజిక సేవా పనులపై కార్యకర్తలు నిరంతరం ఆపకుండా పనిచేయాలన్నారు. కరవే జిల్లా అధ్యక్షుడు హులుగప్ప మాట్లాడుతూ కరావే కార్యకర్తలు ప్రతి ఒక్కరిలో కన్నడ గర్వాన్ని నింపాలని, దేశ భూమి, నీరు, భాష రక్షణకు దృఢంగా కట్టుబడి ఉండాలన్నారు. కర్ణాటక రక్షణ వేదిక కంప్లి తాలుకా విభాగం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటరమణకు అర్హత పత్రం అందేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కేఎస్ చాంద్‌బాషా, రమేష్, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, నాయకులు సిద్దప్ప, కారేకల్ మనోహర్, రామన్న, షణ్ముఖప్ప, బాస్కర్‌రెడ్డి, దేవేంద్ర, షెక్షావలి, బళ్లాపుర, మౌనేష, కార్తీక్, తిప్పేస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రధాని 'అమృత్‌కాల్'



మొక్కను నాటుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి

బళ్లారి సిటీ,జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'వికసిత్ భారత్ అమృతకాల సేవ' కార్యక్రమాన్ని హొసపేటలో తాలూకా బైలవద్దిగేరిలోని సుడుగాడప్ప తాత ఆలయంలో సోమవారం ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధానమంత్రి మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పాపినాయకనహళ్ళి ,గాదిగనూర్, బైలవద్దిగేరి గ్రామస్థులందరూ వీక్షించారు. 11సంవత్సరాలలో కేంద్రప్రభుత్వం సాధించిన విజయాల గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌మేటి, జిల్లాప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు కిచడి కొట్రేశ్, పాపినాయకనహళ్ళి పంచాయితీ అధ్యక్షురాలు అంకాలమ్మ, బైలవద్దిగేరి గ్రామపంచాయితీ అధ్యక్షురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రిమ్స్ ఆస్పత్రిలో బాలుడి అదృశ్యం



విష్ణునాయక్

రాయచూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేరిన బాలుడు అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 21న రాయచూరు తాలూకాలోని జులమగేరా తాండాకు చెందిన 9 ఏళ్ల విష్ణు నాయక్ సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. చేతి వేళ్లకు తీవ్ర గాయాలు కాగా తల్లిదండ్రులు బాలుడిని చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అదే ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్న వైద్యులు అత్యవసర చికిత్స అనంతరం జనరల్ వార్డ్‌కు తరలించారు. 22వ తేదీ రాత్రి వరకు బెడ్ పై ఉన్న బాలుడు తెల్లవారు జామున 3 గంటలప్పుడు తల్లి లేచి చూడగా బాలుడు కనిపించక పోవడంతో కంగారు పడి బాలుడి కోసం వెతికారు. బాలుడి వద్దే సహాయకురాలిగా ఉన్న తల్లి నాగలక్ష్మి వైద్యులకు తెలపగా ఆస్పత్రి అంతా కలియదేరిన వారికి బాలుడి ఆచూకీ దొరకలేదు. వెంటనే మార్కెట్ యార్డ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పని చేయకపోవడం గుర్తించారు. దీంతో ఆస్పత్రి వర్గాలపై ఒకింతా అసహనం వ్యక్తం చేసిన పోలీసులు కేసు నమోదు చేసి బాలుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

గ్రామంలో మొసలి ప్రత్యక్షం



మొసలిని పట్టుకున్న అటవీ శాఖ అధికారులు, మత్స్యకారులు

రాయచూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని మర్చెడ్ గ్రామ పరిసరాల్లో సోమవారం భారీ మొసలి కనిపించింది. గ్రామస్థులు అటవీ శాఖకు సమాచారం ఇవ్వడంతో మత్స్యకారుల సహాయంతో మొసలిని పట్టుకున్నారు. గ్రామ పరిసరాల నుంచి చెరువులోకి వెళ్తున్న మొసలిని చూసిన వెంటనే గ్రామస్థులు, మత్స్యకారులు భయభ్రాంతులకు గురై అటవీ శాఖకు సమాచారం అందించారు. మత్స్యకారుల సహాయంతో అధికారులు చెరువులో వేసిన వలలో మొసలి చిక్కుకుంది. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అటవీ శాఖ అధికారులు మొసలిని కృష్ణా నదిలోకి సురక్షితంగా వదిలారు. జోనల్ ఫారెస్ట్ ఆఫీసర్ రాజేష్ నాయక్, పెట్రోల్ ఫారెస్ట్ వార్డెన్ బసవరాజ్ పాల్గొన్నారు.

క్షయరహిత సమాజమే లక్ష్యం

● జిల్లా వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శి సురేష్ బాబు

బళ్లారి సిటీ,జూన్ 30(ఆంధ్రజ్యోతి): క్షయ రహిత దేశం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించని, ప్రజలు సహకరించి వ్యాధిని పూర్తిగా సమసిపోయేలా చూడాలిన బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి గౌరవ కార్యదర్శి కేసీ. సురేష్ బాబు అన్నారు. వాణిజ్య పరిశ్రమల మండలి ఉచిత ఆసుపత్రి ప్రాంగణంలో సోమవారం నుంచి ఏడు రోజుల పాటు జరగనున్న ఉచిత టీబీ(క్షయ)తనిఖీ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య సమాజంతోనే ఉత్తమ దేశం ఏర్పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చి క్షయ లక్షణాలుంటే తక్షణమే పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు గుప్త, ల్యాబ్ టెక్నీషియస్ షేక్షావళి, బళ్లారి జిల్లా పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రామయంద్ర, చాంబర్ ఆఫ్ కామర్స్ ఫ్రీ హాస్పిటల్ చైర్మన్ సురేంద్ర కుమార్, దళాలీ ట్రేడర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.గురుస్వామి, ఉపాధ్యక్షుడు కే.నాగరాజు, వైద్యాధికారి డాక్టర్ కట్టాసత్యనారాయణ, బీడీసీసీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్మికులు, కూలీలు, రైతులు కూరగాయల విక్రేతలు, సాధారణ ప్రజలు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారికి వైద్యులు ఉచిత చికిత్స, మందులు, ఆరోగ్యకరమైన పోషకాహారాల గురించి సమాచారం అందజేశారు.

హోసూరు జోన్

శివభద్రకాళి ఆలయంలో విశేష పూజలు

హోసూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచశాంతికోసం హోసూరు శివభద్రకాళి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. ప్రత్యేకించి ఓంకారయాగంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రపంచదేశాలమధ్య పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతను తగ్గించడానికి ప్రజల శాంతి శ్రేయస్సుకోసం ప్రార్థనలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గణపతిహోమం, సుబ్రమణ్యాహోమం, ఓంకార శివభదక్రాళి ప్రత్యేక యాగాలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం మహామంగళారతి తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వందలాది మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట, జూన్30 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్(పట్టణ)2.0 పథకం కింద తాలూకాలోని హగరిబొమ్మనహళ్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ చీఫ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్లు, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులు, మైనార్టీ వర్గాలు, పారిశుధ్య కార్మికులు, ప్రధాన మంత్రి స్వానిధి పథకం కింద గుర్తించబడిన వీధి వ్యాపారులు, ప్రధాన మంత్రి విశ్వరామ్ యోజక కింద గుర్తించబడిన నైపుణ్యం కలిగిన కార్మికులు, అంగన్‌వాడీ కార్మికులు, నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులు, వలస కుటుంబాలు,స్థానిక నివాసితులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో స్వయంగా సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు కార్యాలయ ఆశ్రమ శాఖ అధికారులకు సంప్రదించాలన్నారు.



దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

దుకాణ సముదాయం ప్రారంభం

హోసూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హోసూరులోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై కాళికాంబల్ కంబటేశ్వరన్ ఆలయానికి చెందిన స్థలంలో సుమారు 76 లక్షల రూపాయలతో 98 దుకాణాలు నిర్మించారు. దుకాణదారులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించారు. వీటిలో 70 దుకాణాలను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. వీటిని పూలదుకాణాల కోసం టెండరు ద్వారా ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మాజీ ఎమ్మెల్యే మనోహరన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చిన్నస్వామి, ట్రస్టీ బోర్డు చైర్మన్ వెంకటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జూజువాడిలో శౌచాలయ సదుపాయం

హోసూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జూజువాడి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో 2150మంది విద్యార్థులు ఉన్నారు. వారి కోసం స్థానిక కౌన్సిలర్ శ్రీధర్ వినతిమేరకు టినాగో ప్రైవేట్ కంపెనీ సీఎస్ఆర్ నిధులకింద రూ.30లక్షలతో 42 శౌయాలయాలు నిర్మించారు. శౌచాలయ భవనాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌లు శ్రీధర్, అశోక్, ప్రధానోపాధ్యాయురాలు నర్మదాదేవి, టినాగో కంపెనీ డైరెక్టర్ దేవనాథన్, ప్లాంట్ మేనేజర్ రంజిత్ పాల్గొన్నారు. అలాగే యూనియన్ అధ్యక్షుడు శరణ్‌రాజ్, కార్యదర్శి ముబారక్, పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



శౌచాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్, టినాగో ప్రతినిధులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

హరనాథ్ బాబా (జయంతి)



పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో పేరొందిన సంఘసంస్కర్త హరనాథ్ బాబా 1865 జులై 1న జన్మించారు. భగవంతుడికి, మనిషికి మధ్య సంబంధాన్ని సార్వత్రిక మతంగా మార్చిన ఒక ప్రత్యేకమైన ఆగమనం ఆయనది. హరనాథ్ ఎలాంటి ఆరాధనను స్థాపించలేదు. పాపులను ప్రేమమార్గంలో ఆకర్షించాడు. భక్తులకు సహాయం చేయడానికి, రక్షించడానికి అనేక అద్భుతాలు చేశాడు. ఆయన అనుచరులు హరనాథ్ చైతన్యమహాప్రభు అవతారం యొక్క కొనసాగింపుగా నమ్ముతారు. 1927 మే 25న భౌతికప్రపంచం నుండి వైదొలగారు.

బీసీ రాయ్ (జయంతి, వర్ధంతి)



'భారతరత్న' గ్రహీత బిధాన్ చంద్ర రాయ్ 1882 జూలై 1న పాట్నా ప్రాంతంలో జన్మించారు. ఫిజీషియన్, విద్యావేత్త, మానవతావాది, స్వాతంత్ర్య సమర యోధుడు, దార్శనికుడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 1948 నుంచి తుదిశ్వాస దాకా అంటే 1962 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. దుర్గాపూర్, కల్యాణి, బిధాన నగర్, అశోక్ నగర్, హబ్రా లలో విద్యాసంస్థలు ఏర్పాటు కావడంలో కీలక పాత్ర పోషించారు. ఎఫ్ఆర్‌సీఎస్, ఎంఆర్ సీపీ లను ఒకేసారి పొందిన అరుదైన వ్యక్తులలో ఒకరు. వైద్య రంగంలో ఆయన సేవలకు గుర్తుగా 'నేషనల్ డాక్టర్స్ డే'ను ఆచరిస్తున్నారు. కాగా వైద్య, రాజకీయ, సైన్స్, ఫిలాసఫీ, సాహిత్యం, ఆర్ట్సలలో రాణించిన వారికి బీసీ రాయ్ నేషనల్ అవార్డులు కూడా ఇస్తున్నారు. 80వ యేట 1962 జూలై 1న కన్నుమూశారు.

ఇంటూరి వెంకటేశ్వరరావు (జయంతి)



ఇంటూరి వెంకటేశ్వరరావు 1909 జూలై 1న గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం చంద్రాజు పాలెం గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మూడేళ్లకు పైగా కారాగార శిక్ష అనుభవించారు. అనంతరం తెలుగు సినిమా చరిత్ర పరిశోధకుడిగా రాణించారు. సుమతి, మాయలోకం, పేదరైతు, లక్ష్మీ, సక్కుబాయి, నాగపంచమి తదితర సినిమాలకు సహాయక దర్శకులుగా పనిచేశారు. ఆయన సృష్టించిన కుమ్మరి మొల్ల కావ్యం నాటకం, రేడియో నాటకం, బుర్రకథ, సినిమాగా వెలుగు చూసింది. తెలుగులో ప్రప్రథమ సినిమా మాసపత్రిక 'చిత్రకళ'ను 1937లో ప్రారంభించారు. ఐదు దశాబ్దాల పాటు ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. రఘుపతి వెంకయ్య అవార్డు, కళాప్రపూర్ణ బిరుదు పొందారు. 2002 మే 7న కన్నుమూశారు.

కేవీ రెడ్డి (జయంతి)



కేవీ రెడ్డిగా సుపరిచితులైన కదిరి వెంకటరెడ్డి 1912 జూలై 1 అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించారు. తెలుగు సినిమా స్వర్ణయుగంగా భావించేకాలంలో విజయవంతమైన, విమర్శకులు సైతం ఆణిముత్యాలుగా అభివర్ణించిన పలు సినిమాలు తీసిన దర్శకుడు. 14 సినిమాలు తీయగా 10 వాణిజ్యపరంగా విజయం అందుకున్నాయి. దర్శకుడు, నిర్మాత, రచయిత, ప్రొడక్షన్ మేనేజర్‌గా రాణించారు. భక్త పోతన, పాతాళ భైరవి, మాయాబజార్, దొంగ రాముడు, శ్రీకృష్ణసత్య సినిమాలు సూపర్‌హిట్‌గా నిలిచాయి. ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ దర్శకుడి అవార్డు పొందారు. 1972 సెప్టెంబరు 15న కన్నుమూశారు.

ప్రిన్సెస్ డయానా (జయంతి)



వేల్స్ యువరాణి డయానా 1961 జులై 1న జన్మించారు. బ్రిటీష్ రాజ కుటుంబానికి చెందిన చార్లెస్ మొదటి భార్య. బ్రిటీష్ రాజకుటుంబంలో తనదైన గుర్తింపు పొందారు. ప్రిన్స్ విలియమ్, ప్రిన్స్ హ్యారిలకు తల్లిగాను గుర్తింపు పొందారు. సామాజికసేవా కార్యక్రమాలతో పాటు ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. 36వ యేట 1997 ఆగస్టు 31న కన్నుమూశారు.

హరిప్రసాద్ చౌరాసియా (పుట్టినరోజు)



పద్మ విభూషణ్ గ్రహీత హరిప్రసాద్ చౌరాసియా 1938 జూలై 1న అలహాబాద్‌లో జన్మించారు. హిందూస్తానీ సంగీతంలో ఫ్లూటిస్ట్ (వేణు వాదకులు)గా ఎంతో పేరొందారు. జానపద, ఉత్తరభారతీయ శైలి, పాశ్చాత్య సంగీత శైలిలోనూ రాణించారు. ముంబై, భువనేశ్వర్‌లలో వృందావన్ గురుకుల్ ఏర్పాటు చేసి ప్రాచీన గురుకులం విధానంలో సంగీతాన్ని నేర్పిస్తున్నారు. పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ, కోనార్క్ సమ్మాన్, పూనె పండిట్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు.

ఎం వెంకయ్యనాయుడు (పుట్టిన రోజు)



భారత 13వ ఉపరాష్ట్రపతిగా వ్యవహరించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు 1948 జూలై 1న నెల్లూరు జిల్లాలోని చవటపాలెం గ్రామంలో జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీనుంచి లా పట్టా పొందిన ఆయన సమాజంలో అణగారిన వర్గాలు, రైతుల కోసం శ్రమించారు. సామాజిక కార్యకలాపాలలోనూ, రాజకీయాల్లోనూ రాణించారు. భారతీయ జనతా పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. 2019లో గౌరవ డాక్టరేట్ సహా పలు గౌరవాలు అందుకున్నారు.

కొలకలూరి ఇనాక్ (పుట్టినరోజు)



తెలుగు రచయిత కొలకలూరి ఇనాక్ 1939 జూలై 1న గుంటూరు జిల్లా వేజెండ్ల గ్రామంలో జన్మించారు. సాహితీ కారుడు, కవిగా రాణించారు. తెలుగు పదాలకు వెలుగు అద్దిన పద నిర్దేశి. ఆధునిక సాహిత్య ప్రక్రియలో అన్ని రుచులనూ చవిచూచిన నేర్పరి. ఉపాధ్యాయుడిగా, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. 2014లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

కాంగ్రెస్ నిరసనలపై బీజేపీ ఆగ్రహం

బెంగళూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఇటీవల తరచూ బీజేపీ ఆఫీసుముందు నిరసనకు దిగుతున్నారని, తద్వారా ఉద్రిక్తతకు కారణమవుతోందని బీజేపీ సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధానసౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం ముందు పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, రవికుమార్, మాజీ ఎమ్మెల్యే సంపంగి, కేశవప్రసాద్, వై రామక్క, హరీశ్ తదితరులు ఆందోళన చేశారు. అనంతరం వారు నగర పోలీస్ కమిషనర్‌ను భేటీ అయి వినతిని ఇచ్చారు. నెలలో మూడునాలుగుసార్లు ఇదే తరహాలో పార్టీ ఆఫీసు ముందు కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేశారన్నారు. వారిపై కేసులు, ఎఫ్ఐఆర్‌లు ఉండవన్నారు. కానీ బీజేపీ ఒక పోస్టర్ వేసినందుకే కేసు నమోదు చేశారన్నారు. బీజేపీ ఎన్నడూ కాంగ్రెస్ ఆఫీస్ ముందు ఆందోళన చేయలేదన్నారు. ఈ విధానం కొనసాగితే పరస్పర వివాదాలు పెరిగేందుకు కారణమవుతాయన్నారు.



గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

నైతిక విలువలు నేర్పించండి



ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ గీత తదితరులు

ముళబాగిలు, జూన్30(ఆంధ్రజ్యోతి): పిల్లలకు సంస్కారంతోపాటు నైతిక విలువలు నేర్పించాలని తద్వారా చక్కటి జీవనం, పేరు సాధ్యమని తహసీల్దార్ గీత అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కనక సముదాయ భవనంలో కనక ఉద్యోగుల క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో హాలుమత సముదాయానికి చెందిన ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక ఉద్యోగం పొందడం అంత సులభం కాదన్నారు, అకడమిక్ తోపాటు నైపుణ్యం ఉంటేనే సాధ్యమ న్నారు. ప్రతిభావంతులకు పోటీ పెరిగిందని అందులో రాణించేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటుందన్నారు. మనోస్థైర్యం ద్వారా సమస్యను అధిగమించే అవకాశం ఉందన్నారు. టీబీఎంపీ కేఏఎస్ అధికారి లలితమ్మ కన్యాగప్ప మాట్లా డుతూ విద్యార్థులను ప్రోత్సహించే వాతావరణం కల్పించాలన్నారు. కష్టపడి పనిచేస్తే ఫలితం సాధ్యమన్నారు. బెస్కాం ఏఈఈ రమేశ్, ఉద్యో గుల క్షేమాభివృద్ధి సంఘం తాలూకా అధ్యక్షుడు ఎస్ఆర్ వెంకటేశప్ప, ప్రధాన కార్యదర్శి శంకరప్ప, కోశాధికారి లోకేశ్, గ్రామపంచాయతీ సభ్యుల మహా సమాఖ్య తాలూకా అధ్యక్షుడు పెత్తాండ్ల హళ్ళి శంకర్, యువ నాయకుడు సంగొళ్ళి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హాసన్‌లో గుండెపోటుతో మరో ముగ్గురి మృతి

40 రోజుల్లో 22 మంది...

బెంగళూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లాలో గుండెపోటు మరణాలు భయాందోళన కలిగిస్తున్నాయి. సోమవారం ముగ్గురు చనిపోయారు. ముత్తయ్య (58), కుమార్ (57), లేపాక్షి అనే మహిళ (50) గుండెపోటుకు గురై మృత్యువాత చెందారు. బేళూరు పట్టణం జేపీనగర్‌కు చెందిన లేపాక్షి అనే మహిళ గుండెపోటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆమెను బేళూరు ఆసుపత్రికి తీసుకెళ్తుండగానే మృతి చెందినట్టు తెలిపారు. ఇక హొళె నరసీపురలో డిగ్రీ కాలేజ్ ఇంగ్లిష్ అధ్యాపకుడు ముత్తయ్య కన్నుమూశారు. కాలేజీకి వెళ్తూ మార్గమధ్యంలో హొళెనరసీపుర బైపాస్ వద్ద టీ తాగేందుకు కుప్పకూలాడు. వెంటనే స్థానికులు చన్నరాయపట్టణ తాలూకా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. ఇక చన్నరాయపట్టణ తాలూకా డి గ్రూప్ ఉద్యోగి కుమార్ ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నవేళ ఛాతీలో నొప్పి వచ్చింది. కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్సలు ఫలించక సోమవారం ఉదయం కన్నుమూశారు. 40 రోజులలో 22మంది మృతి చెందినట్టు జిల్లావాసులు తెల్పుతున్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌కు ఆత్మీయ వీడ్కోలు

విజయపుర, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విజయపుర పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా ఏడేళ్లపాటు వ్యవహరించి రిటైరైన వెంకటేశ్‌కు సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు కూడా పాల్గొన్నారు. సన్మానం స్వీకరించిన అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఢిల్లీకి వెళ్తున్న వేళ రైల్వేస్టేషన్‌లో వీడ్కోలు పలికిన తీరు గుర్తుకొచ్చిందన్నారు. 31ఏళ్ల వ్యవధిలో విజయపుర పట్టణంలో ఏడేళ్లపాటు కొనసాగానన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల సహకారం ఎంతో ఉందన్నారు. కళాశాలల్లో అవసరమైన స్మార్ట్‌క్లాస్‌లు, శుద్ధతాగునీరు, నిరంతర విద్యుత్‌కోసం సోలార్ విద్యుత్ ఇతరత్రా సదుపాయాలు కల్పించడంలో వెంకటేశ్ చొరవ ప్రశంసనీయమని ఇతర అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.



వెంకటేశ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా రిటైర్డు జిల్లా విద్యాశాఖఅధికారి హనుమంతప్ప, పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు హనీఫుల్లా, సీనియర్ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వీఎం కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూముల ప్రక్రియ జాప్యంపై నిరసన

శిడ్లఘట్ట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె హోబళి కేఐఏడీబీ భూముల రైతుల పర పోరాటానికి పలు ప్రగతిపరసంఘాలు మద్దతు ఇస్తున్నాయి. జిల్లాధికారి భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గగనసింధు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు. జంగమకోటె హోబళిలోని 13 గ్రామాలు 2823 ఎకరాల భూమిని కేఐఏడీబీ భూస్వాధీనం చేసుకుని పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమైంది. 13 నెలలు గడిచినా భూస్వాధీన ప్రక్రియ మందగతిన సాగుతోందని, భూములకు ఉత్తమ పరిహారం ఇవ్వాలని, ఇంటికొక ఉద్యోగం కల్పించడంలో జాప్యమైందని రైతు, దళిత, కన్నడసంఘాలు ప్రముఖులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 13 గ్రామాల పోరాట సమితి ప్రముఖులు నెనపినాయకనహళ్ళి సుబ్రమణి, వాసుదేవ్‌మూర్తి, ప్రమోద్, రైతుసంఘం భక్తరహళ్ళి ప్రతీశ్, మునేగౌడ, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

లోకాయుక్త రాజీనామాకు డిమాండ్



ఫ్రీడం పార్కులో కర్ణాటక రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిరసన

బెంగళూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతి రాజ్య మేలుతోందని, అక్రమాలు, విధి నిర్వహణలో లోపం, నిత్యం సాగుతున్నా లోకాయుక్త సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు రవికృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీడంపార్కు నుంచి చలో విధానసౌధకు సిద్ధం కాగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రవికృష్ణారెడ్డి మాట్లాడుతూ లోకాయుక్త సంస్థ ముఖ్యులు న్యాయమూర్తి బీఎస్ పాటిల్ సంపూర్ణంగా విఫలమయ్యారని, ఆయన రాజీనామా చేయాలన్నారు. లోకాయుక్తలోనే అవినీతి జరుగుతోందన్నారు. లోకాయుక్త కుటుంబీకులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. కర్ణాటక లోకాయుక్త దేశానికి ఆదర్శంగా పేరొందిందని, కానీ ఇటీవల తీరు మారిందన్నారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపురను కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

సమాజ సేవతోనే జీవితానికి సార్థకత

చిక్కబళ్ళాపుర, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సమాజసేవతోనే మానవ జీవితానికి సార్థకత సాధ్యమని సామాజిక కార్యకర్త అనంత్‌కుమార్ అభిప్రాయపడ్డారు. చిక్కబళ్ళాపుర తాలూకా అంకనూరు గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన ట్రాక్‌సూట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు తనవంతుగా బట్టలు ఇచ్చినందుకు మానసిక తృప్తి లభించిందన్నారు. ప్రతి ఒక్కరూ ఎంతో కొంత సమాజసేవ చేయాలన్నారు. కార్యక్రమంలో అనంతకుమార్ భార్య వెంకటలక్ష్మమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు వెంకటేశ్, శ్రీనివాస్, బాలాజి, ప్రవీణ్, వినోద్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్‌సూట్‌లతో విద్యార్థులు

శంభులింగేశ్వర స్వాములకు పుష్పాలంకార సేవ

సిరుగుప్ప, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) శంభులింగేశ్వర మహాస్వాములకు ఆషాఢ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు రోడ్డు మార్గంలో తుంగభద్ర నది ఒడ్డున ఉన్న శంభు లింగేశ్వర మహాస్వాములకు ఆషాఢ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు పుష్పాలంకరణ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

దర్వేష్ గ్రూప్ బాధ్యుల ఆస్తుల జప్తు

రాయచూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశ చూపి పెద్ద ఎత్తున డిపాజిట్‌లు సేకరించడంతో పాటు దాదాపు వందలాది మందిని మోసగించిన దర్వేష్ కంపెనీ పై ఎట్టకేలకు చట్టపరమైన చర్యలు మొదలైయ్యాయి. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ శాఖ కార్యదర్శి, దర్వేష్ కంపెనీ బాధ్యుల ఆస్తులను జప్తు చేసేలా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జిల్లా అధికారులకు అందాయి. దర్వేష్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడితో పాటు గ్రూప్‌లో డైరెక్టర్‌లుగా ఉన్న వారు ఏజెంట్లు ఇతరత్ర బాధ్యులకు సంబంధించిన స్థిర, చర ఆస్తులను జప్తు చేసుకునే అధికారం ఉత్తర్వుల ద్వార జిల్లా యంత్రాగానికి దక్కినట్లు సోమవారం అధికారులు తెలిపారు.

జీవన మార్గదర్శకుడు గురువు

భరతమాత సేవాట్రస్టు అధ్యక్షుడు

పావగడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి జీవన మార్గదర్శకుడు గురువు అని భరతమాత సేవాట్రస్టు అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్ అన్నారు. గురువు ప్రాత సమాజంలో ప్రముఖమైనదని పేర్కొన్నారు. సోమవారం తాలూకా పరిధిలోని మల్లమ్మనహళ్లి, పెన్నోబుళహళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డను ప్రపంచానికి పరిచయం చేస్తే గురువు సంస్కారవంతమైన విద్యను బోధించి ప్రపంచం తనవైపు దృష్టిసారించేలా చేయగలడన్నారు. ట్రస్టు కోశాధికారి గోపాలకృష్ణ, సభ్యులు నాగరాజు, దినేష్, హెచ్ఎంలు విజయలక్ష్మీ, గోవిందప్ప పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

పావగడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగంపై అవగాహన ర్యాలీని ఉద్యోగులు సోమవారం నిర్వహించారు. అవసరం మేరకు విద్యుత్‌ను వినియోగించాలని సూచించారు. విద్యుత్ తీగల వద్ద వస్త్రాలను ఆరివేయడం, విద్యుత్ స్తంభాల వద్ద నిలుచోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఈ కృష్ణమూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి

తిరుమలకు ప్రత్యేక పుష్పాలు



తండ్రితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న సునితా తిమ్మేగౌడ

బెంగళూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశికి తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రత్యేకమైన పుష్పాలను కొన్నేళ్లకాలంగా పంపుతున్నామని ఈ ఏడాది కూడా అమలు చేస్తామని పారిశ్రామికవేత్త సునితా తిమ్మేగౌడ సోమవారం బెంగళూరులో వెల్లడించారు. ఇటీవలే సుధా కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు, తండ్రి తిమ్మేగౌడతో కలసి తిరుమలను దర్శించి అధికారులతో చర్చించినట్టు ఆమె తెలిపారు. ఏటా బెంగళూరులో లభించే పుష్పాలతోపాటు విదేశాలనుంచి కూడా తెప్పిస్తామన్నారు. వైకుంఠ ఏకాదశి రోజున నవరత్నాలతో విశేష అలంకరణలు జరుపుతామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రాచీన ఆలయాల పునరుద్ధరణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు.

బయో ఎనర్జీకి సహకారం



సుర్జేవాలాతో సుధీంద్ర

బెంగళూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇప్పటికే ప్రస్తావించిన అంశాలకు అను మతి ఇస్తే రానున్న ఐదేళ్లలో బయో ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెరగనున్నాయని రాష్ట్ర బయోఇంధన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుధీంద్ర అభిప్రాయ పడ్డారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాను సోమవారం ఆయన భేటీ అయ్యారు. బయో ఎనర్జీ మండలి అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. 2024-25లో రాష్ట్ర బయో ఎనర్జీమండలి చేపట్టిన కార్యాచరణను, అభివృద్ధికి పెట్టుబడులు పెరిగిన విధానాన్ని వివరించారు. అనంతరం సుర్జేవాలా సానుకూలంగా స్పందిస్తూ బయో ఎనర్జీమండలికి అవసరమైన గ్రాంట్లు విడుదలకు సహకారం ఇస్తానని భరోసా ఇచ్చారని సుధీంద్ర మీడియాకు తెలిపారు.

రహదారికి మరమ్మతులు ఎన్నడో..?



కంకర తేలిన ప్రధాన రహదారి

సిరుగుప్ప, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రహదారి 150 అభివృద్ధికి నోచుకునేది ఎన్నడో అని ప్రజలకు ప్రశ్నార్థకంగా మారింది. సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట పట్టణం నుంచి దడే సూగూరు గ్రామం వరకు 150 రహదారి నిర్మాణ పనులకు రూ.118 కోట్లు నిధులు విడుదలై మూడేళ్లు గడుస్తోంది. ఈ 11 కిలో మీటర్ల రహదారిని అభివృద్ధి చేయడంలో రహదారుల శాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం మూడు కిలోమీటర్లు కూడా రోడ్డు పనులు పూర్తి కాలేదు. ఎక్కడపడితే అక్కడ గుంతలు, మట్టి రోడ్లు, దర్శనమిస్తున్నాయి. ఇక వర్షం వస్తే రోడ్లంతా చిత్తడిగా మారుతోంది. న్యాయవాది సంఘం, జాతీయ పార్టీలు, లెఫ్ట్ పార్టీలు ఈ విషయంపై ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం మాత్రం అంతంత మాత్రంగా వుంది. ఇప్పటికే ఈ దారిలో ఎన్నోసార్లు ప్రమాదాలు జరిగాయి. అయినా మరమ్మతులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. విజయనగరం జిల్లా రహదారుల అధికారులను ప్రశ్నిస్తే కాంట్రాక్టర్లు స్పందించడం లేదని బదులిస్తున్నారు. వారం రోజుల క్రితం పీడబ్ల్యూడీ శాఖ మంత్రి సతీష్ జార్కిహోళి కాంట్రాక్టర్‌పై కేసులు నమోదుచేయాలని ఆదేశించినా పనులు మాత్రం జరగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కోరింది కావాలంటే ఎట్లా..?

- మహిళా పోలీసుల బదిలీల్లో వివాదం
- స్పౌజ్ వైపు వెళ్లకుండా నచ్చినచోట కొందరి ఆప్షన్
- అభ్యంతరం తెలిపిన మిగిలిన ఉద్యోగులు
- సచివాలయ మహిళా పోలీసుల బదిలీలు ప్రారంభం
- సిఫార్సు లేఖలతో పారదర్శకతపై అనుమానాలు

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసుల బదిలీల్లో స్పౌజ్ వివాదం తలెత్తింది. దీంతో కొంత సేపు గందరగోళం, సందిగ్ధం నెలకొంది. బదిలీల కౌన్సెలింగ్‌లో కొందరు మహిళా పోలీస్‌లు తమ స్పౌజ్ ఉన్న ప్రాంతం వైపు కాకుండా అనంతపురంలోనే ఆప్షన్ ఇవ్వడంతో మిగిలిన వారు అభ్యంతరం తెలిపారు. దీంతో పోలీస్ ఉన్నతా ధికారులు ఆప్షన్లు ఇచ్చిన వాళ్లను మళ్లీ వెనక్కు పిలిచారు. దీంతో కొంత గందరగోళం నెలకొంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీస్‌లకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే 12 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన వందలాది మంది మహిళా పోలీసులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. సుమారు గంట సేపు కౌన్సెలింగ్ సాజావుగా సాగింది. అయితే హఠాత్తుగా కొందరు స్పౌజ్‌ను దుర్వినియోగం చేశారంటూ అభ్యంతరం తెలిపారు.

స్పౌజ్ వైపు కాకుండా..

కొందరు దరఖాస్తుదారులు తమ భర్త లేదా భార్య(స్పౌజ్) ఉన్న పట్టణం లేదా, దాని సమీప ప్రాంతాలు కాకుండా తమకు నచ్చిన పట్టణాల్లో కోరుకున్నారు. ఒక అభ్యర్థి భర్త హిందూపురంలో ఉంటే....ఆమె అనంతపురానికి ఆప్షన్ ఇచ్చారు. మరో అభ్యర్థి భర్త నార్పలలో ఉంటే ఆమె అనంతపురంలోని సచివాలయానికి ఆప్షన్ ఇచ్చారంటూ అభ్యర్థులు ఆందోళన చేశారు. ఇలా సుమారు నలుగురు ఆప్షన్లు ఇచ్చారంటూ కొందరు మహిళా పోలీసులు అభ్యంతరాలు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్పీ జగదీష్, డీఎస్పీలు ఆ అభ్యర్థులను వెనక్కు రప్పించి స్పౌజ్ సమస్యపై విచారించారు. తర్వాత కౌన్సెలింగ్‌ను సజావుగా కొనసాగించారు. బయట ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు వద్దకు రూరల్ సీఐ శేఖర్, మరికొందరు పోలీసులు వచ్చి బదిలీలు పారదర్శకంగానే జరుగుతున్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దంటూ సముదాయించారు.

ఖాళీలు డిస్‌ప్లే చేయలేదని ఆవేదన..

కౌన్సెలింగ్‌కు ముందు ఖాళీల జాబితా ప్రకటించకపోవడంపై చాలామంది మహిళా పోలీస్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ హాల్‌లోకి వెళ్లే వరకూ ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో తెలియని అయోమయ పరిస్థితి ఉందని వాపోయారు. లోపల కౌన్సెలింగ్‌కు వెళ్లిన వాళ్లు ఏ ప్లేస్‌కు ఆప్షన్ ఇచ్చారు..? ఏ ప్లేస్‌లు మిగిలాయో..? తాము ఎక్కడికి ఆప్షన్ ఇవ్వాలో అంటూ హైరానా పడ్డారు. కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు తీసుకున్న తర్వాత మిగిలే ఖాళీలు(లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలు) చూసేలా బయట డిస్‌ప్లే బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అభ్యర్థులు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో 3, 4 సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో బదిలీల పారదర్శకతపై అనేక సందేహాలు కలుగుతున్నాయి. కాగా మధ్యాహ్నం మొదలైన కౌన్సెలింగ్ రాత్రి వరకూ కొనసాగింది.


కౌన్సెలింగ్‌లో వేకెన్సీలు చూస్తున్న మహిళా పోలీసులు


కిటకిటలాడుతున్న డీపీఓ ప్రాంగణం


స్పౌజ్ వివాదంపై అభ్యంతరం చెబుతున్న మహిళా పోలీసులు


తల్లులు కౌన్సెలింగ్‌కు హాజరుకావడంతో పిల్లలను నిద్రపుచ్చుతున్న వారి బంధువులు

'నాయకుల' తీరు సందేహాస్పదం

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో యూనియన్ నాయకుల తీరుపై విమర్శలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ విభాగంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో యూనియన్ నాయకులు వ్యవహరించిన తీరు సందేహాస్పదంగా మారింది. నాయకులు బాధితుల పక్షమా..? లేక అధికారుల పక్షమా అన్నది అర్థం కాకుండా పోయింది. సోమవారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఈ జహీర్ అస్లాం ఏక పక్షంగా బదిలీలకు శ్రీకారం చుట్టారన్న ప్రచారం జరుగుతోంది. ఇందులో అనంతపురం ఈఈకి కూడ ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకుండా శ్రీ సత్యసాయి జిల్లా ఈఈ, ఇన్‌చార్జ్ ఎస్ఈ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బదిలీలకు శ్రీకారం చుట్టారన్న విమర్శలు ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా ఉన్నవారు యూనియన్ నాయకుల పేరుతో బదిలీల విషయంగా చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. అయితే అధికారులతో సమావేశమై సోమవారం చర్చలు జరపడం వీరి తీరును సందేహింపజేస్తోంది. మీకు కావాల్సినవి మీరు తీసుకోండి. మా విధులకు అడ్డు తగలద్దండి అనే ఒప్పందానికి వచ్చారన్న ప్రచారం జరుగుతోంది. అయితే సోమవారం వరకు ఎస్ఈ జహీర్ అస్లాం బదిలీల ప్రక్రియ అంతా తానై నిర్వహించారు. మంగళవారం నుంచి ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఈఈ ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో నాయకుల నుంచి వచ్చే ఒత్తిళ్లకు బలికావాల్సి వస్తుందన్న ప్రచారం జరుగుతోంది.

దిద్దుబాట..!

బదిలీల్లో పొరపాట్ల సవరణకు అధికారుల శ్రీకారం

డీపీఓ కార్యాలయానికి క్యూకట్టిన బాధితులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగిన తప్పులను సరిదిద్దే చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. తొలి రోజు శనివారం బదిలీల కోసం అధికారులు చేపట్టిన చర్యలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాంకుల వారిగా కౌన్సెలింగ్‌కు శ్రీకారం చుట్టారు. స్పౌజ్, అనారోగ్య కారణాలు ఇతర సమస్యలతో రెక్వెస్ట్ పెట్టుకున్నవారితో అప్పట్లోనే ఆప్షన్ ఫామ్స్ తీసుకొని పంపించేశారు. ఆప్షన్ ఫామ్స్ ఇచ్చిన వాటిని బ్లాక్ చేయమని గుమాస్తాలకు బాధ్యతలు అప్పగించారు. గుమస్తాలు ఇష్టారాజ్యంగా డిమాండ్ ఉన్నవాటినంటిని బ్లాక్ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మొదటి ర్యాంకు నుంచే కొన్ని మండలాలకు ఖాళీలు లేవని అధికారులు చెప్పుకుంటూ రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఏదో అయిపోయింది.. ఇక నుంచి అయిన ర్యాంకుల వారిగా ప్రణాళిక ప్రకారం చేద్దామని నిర్ణయం తీసుకున్న అధికారులకు సిఫార్సు లేఖలు అడ్డు తగిలాయి. సిఫార్సు లేఖలకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ ఇద్దామంటే అప్పటికే పూర్తి అయిపోయాయి. దీంతో మేము సిఫార్సు లేఖ తెచ్చుకొన్నా తమ స్థానం తమకు కాకుండా మరొకరికి ఎలా ఇస్తారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నాయకుల నుంచి అధికారులకు ఫోన్‌లు చేయించినట్లు సమాచారం. దీంతో సిఫార్సు లేఖల ఒత్తిడి ఉన్న స్థానాలకు సంబంధించి సరిదిద్దే ప్రయత్నం చేశారు. స్పౌజ్, ఇతర కేటగిరీల కింద కేటాయించిన వారితో పాటు మొదటి ర్యాంకుకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ కేటాయించిన వారిని బురిడీ కొట్టించే పన్నాగం పన్నారు. ఇందులో స్పౌజ్ కింద వారికి ర్యాంకు ఉండటంతో ఇవ్వాల్సి వచ్చిందని, ర్యాంకు ఉన్నవారికి స్పౌజ్ కేటగిరి కింద ఇవ్వాల్సి వచ్చిందని చెప్పే ప్రయత్నం చేశారు. అయితే అలా ఎలా జరుగుతుందని ఎదురు తిరిగిన వారితో వినతుల స్వీకరిస్తున్నారు. దీంతో బాధితులు డీపీఓ కార్యాలయానికి క్యూ కట్టారు.

కొడుకు అక్రమంగా ఆస్తి రాయించుకున్నాడు

- అధికారులు స్పందించడం లేదు
- కలెక్టర్‌కు వృద్ధురాలి ఫిర్యాదు


వృద్ధురాలు రామలక్ష్మమ్మ

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తన బాగోగులు చూడని కొడుకు ఆస్తినంతా అక్రమంగా బదలాయించుకున్నాడనీ, న్యాయం చేయమంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఓ వృద్ధురాలు.. కలెక్టరేట్‌లో అధికారులకు విన్నవించుకుంది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో రామలక్ష్మమ్మ వినతిపత్రం అందజేసింది. గతంలో అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న తాను ప్రస్తుతం హైదరాబాద్‌లోని కుమార్తె భ్రమరాంబ వద్ద ఉంటున్నానని తెలిపింది. భర్త పర్వతయ్య 2017లో మృతి చెందాడనీ, కుమార్తెలు లలితమ్మ, మల్లీశ్వరి, భ్రమరాంబ, కుమారుడు వెంకటశివయ్య ఉన్నారని చెప్పింది. కుమారుడు వివాహమైనప్పట్నుంచి తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఓ రోజు ఆస్తి డాక్యుమెంట్లు చూస్తానని ఇప్పించుకుని, తాములేని సమయంలో వాటిని తీసుకెళ్లాడని ఆరోపించింది. కొంతకాలానికి తన రెండో కుమార్తె మల్లీశ్వరి మృతిచెందిందని తెలిపింది. తన కుమారుడు దొంగ వీలునామా సృష్టించుకుని, తన భర్త బొటనవేలి ముద్ర వేసుకుని తమ ఆస్తులను అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలోని సర్వేనెంబరు 29/2లో 9.28 ఎకరాలు, కూడేరు మండలం ఇప్పేరులోని సర్వే నంబరు 722/1, 723/1ఏలోని భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించింది. ఈ విషయంపై కోర్టుకెళితే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని వివరించింది. బోగస్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆధారంగా భూమి ఎక్కించారని ఆరోపించారు. సమస్య పరిష్కరించాలని అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయింది.

న్యాయం చేయండి

జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కార్యాలయంలో గతంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని పలువురు.. అధికారులను ఆశ్రయించారు. ప్రభాకర్, శివశంకర్, ప్రమీళ, చంద్రశేఖర్, సోమశేఖర్ తదితరులు వినతిపత్రం అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖలో 2007 నుంచి 2016 వరకు పనిచేశామనీ, ఉన్నఫలంగా తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించి, న్యాయం చేయాలని కోరారు.

బదిలీల్లో అన్యాయం...

వార్డు వెల్ఫేర్ సెక్రటరీల బదిలీల కౌన్సెలింగ్‌లో స్పౌజ్ కేటగిరీకి చెందిన కొందరు బోగస్ సర్టిఫికెట్లతో లబ్ధి పొందారని నవోదయకాలనీకి చెందిన శ్రీకాంత్ ఆరోపించాడు. కొందరు అధికారుల సహకారంతోనే ఇలా చేశారన్నారు. బదిలీ ఉత్తర్వులను నిలుపుదల చేయించాలని కోరాడు.

చెయాల్సిందంతా చేసి..!

అనంతపురం విద్య, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్స్ బదిలీలలో చేయాల్సిందంతా చేసిన ఆ శాఖ డీడీ రామాంజినేయులు.. సోమవారం అందుబాటులో లేకుండాపోయారు. 'ఎమ్మెల్యే లెటర్' పేరిట ఆయన బహిరంగంగా హల్‌చల్ చేశారు. మెరిట్ గురించి ఆయన ఏమాత్రం పట్టించుకోలేదు. కొందరు ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన స్థానాలనూ మార్చేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అంటున్నారు. 'మా పేరు చెప్పి ఎందుకు ఇలా చేశారు..?' అని కొందరు ఎమ్మెల్యేలు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇద్దరు ఎమ్మెల్యేలు ఆయనకు ఫోన్ చేసినా, స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో వారు సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. కౌన్సెలింగ్ సోమవారం తెల్లవారజాము వరకూ జరిగిందని, అందుకే ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారని ఆ శాఖ సిబ్బంది చెప్పుకొచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని బాధితులు అంటున్నారు. న్యాయం కోసం పెన్నార్ భవన్‌లో సోమవారం సాయంత్రం వరకు కొందరు పడిగాపులు కాశారు. కానీ డీడీ అందుబాటులోకి రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

కదిరిఅర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్, ఎకనామిక్స్ అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మ హమ్మద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 50శాతంపైగా మార్కులు ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 4లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.